సాక్షి
కాకినాడ
సోమవారం ၊ 6 ၊ అక్టోబర్ ၊ 2025



రూ.50 వేల విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామివారి నిత్యాన్నదాన పథకానికి అప్పల లక్ష్మీ కామేశ్వరి (రాజమహేంద్రవరం శివారు కొంతమూరు) ఆదివారం రూ.50,002 విరాళం సమర్పించారు.



శివాలయం అభివృద్ధికి రూ.లక్ష

మలికిపురం: మేడిచర్లపాలెం శివాలయం అభివృద్ధికి స్థానిక దాత, ఎన్ఆర్ఐ (యూఎస్ఏ) కటకంశెట్టి ప్రసాద్ ఆదివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.

మరింత తగ్గిన వరద ఉధృతి



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి మరింత తగ్గింది. బ్యారేజీ వద్ద నీటి మట్టం ఆదివారం 7.90 అడుగులకు చేరింది. 4,78,206 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్


కిటకిటలాడిన లోవ



మెట్ల మార్గంలో భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానం ఆదివారం కిటకిటలాడింది. వివిధ జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలి వచ్చిన 10 వేల మంది భక్తులు క్యూ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నట్టు కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. పులిహోర, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,77,700, పూజా టికెట్లకు రూ.1,15,860, తలనీలాలకు రూ.11,200, వాహన పూజలకు రూ.5,340, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలు రూ.55,412, విరాళాలు రూ.77,780 కలిపి మొత్తం రూ.4,43,292 ఆదాయం సమకూరిందని వివరించారు.

ఏలేరులో పెరిగిన నీటి నిల్వలు



ఏలేశ్వరం: పరీవాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. జలాశయంలోకి ఆదివారం 1,616 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం నుంచి 1,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటిమట్టం 86.46 మీటర్లు కాగా, ప్రస్తుతం 84.37 మీటర్లకు చేరింది. పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలకు గానూ నీటి నిల్వలు 19.81 టీఎంసీలకు చేరాయి. ఆయకట్టుకు 900, విశాఖకు 175 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. తిమ్మరాజు చెరువుకు నీటి విడుదలను నిలిపివేశారు.

నేడు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఈ ఏడాది మన జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 52 అవార్డులు ప్రకటించిందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులను సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ గోదావరి క్షేత్రంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అవార్డులు పొందిన సంస్థల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

రైతుకు విపత్తి

- పవన్ ఇలాకాలో రైతుకు మరో విపత్తు
- నిండా ముంచేసిన నకిలీ పత్తి విత్తనాలు
- 2 వేల ఎకరాల్లో పంట నష్టం
- రూ.లక్షల్లో నష్టపోయిన రైతులు
- పట్టించుకోని విత్తన కంపెనీ, అధికారులు



విత్తన దుకాణం వద్ద ఆందోళన చేస్తున్న పత్తి రైతులు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో రైతులు కష్టాలకు గురవుతూనే ఉన్నారు. చిన్న విషయానికి కూడా జిల్లా యంత్రాంగం మొత్తం వచ్చేసి హడావుడి చేసే ఈ నియోజకవర్గంలో ఏడాదిన్నర నుంచి రైతులు అనేక సందర్భాల్లో ఆందోళన బాట పడుతున్న పరిస్థితులే నెలకొంటున్నాయి. గతంలో ధాన్యం కొనుగోళ్లు, వరద నష్టం పంపిణీ.. కొద్ది రోజుల కిందట యూరియా అందక అన్నదాతలు ఆందోళనలు చేశారు. ఈ కోవలోనే తాజాగా నకిలీ విత్తనాలపై పత్తి రైతులు రోడ్డెక్కారు.

జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పత్తి సాగు అధికంగా జరుగుతూంటుంది. ముఖ్యంగా గొల్లప్రోలు మండల రైతులు ఎక్కువగా పత్తి సాగు చేస్తారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఇక్కడి రైతులు వేదా కంపెనీ ఉత్పత్తి చేసిన ప్లాటినం రకం విత్తనాలు కొనుగోలు చేశారు. పంట వేసి రెండు నెలలు గడిచింది. అయినప్పటికీ దిగుబడి రాకపోగా, మొక్కలు వాటంతట అవే ఎండిపోవడం ప్రారంభమైంది. ఎందుకిలా జరుగుతోందో వారికి అర్థం కాలేదు. రకరకాల పురుగు మందులు వాడి చూశారు. అయినా ప్రయోజనం లేదు. విత్తనాలు కొన్న దుకాణదారుకు ఈ సమస్య చెప్తే ఎగతాళిగా మాట్లాడారు. సమస్యను విత్తన కంపెనీ దృష్టికి తీసుకుని వెళ్లడంతో దాని ప్రతినిధులు వచ్చి పంటను చూసి వెళ్లారు. ఆ తరువాత ఎటువంటి స్పందనా లేదు. తమకు జరిగిన నష్టంపై దుకాణదారు, కంపెనీ ప్రతినిధులు కనీసం ఎటువంటి సమాధానం చెప్పకపోవడంపై మండిపడిన రైతులు చేబ్రోలులోని విత్తనాల షాపు ముందు శనివారం రాత్రి ఆందోళన నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాల్లో ప్లాటినం రకం పత్తి విత్తనాలను రైతులు వేసినట్లు సమాచారం. ఒక్క గొల్లప్రోలు మండలం చేబ్రోలు, చెందుర్తి, దుర్గాడ, తాటిపర్తి తదితర ప్రాంతాల్లోనే సుమారు 2 వేల ఎకరాల్లో ఈ రకం విత్తనాలు సాగు చేసినట్లు రైతులు చెబుతున్నారు. ఒక చేబ్రోలులోనే 400 ఎకరాల్లో ఈ విత్తనం వేశారు. ఎకరానికి సుమారు రూ.80 వేల వరకూ పెట్టుబడి పెట్టినా ఒక్క రూపాయి కూడా ఆదాయం రాలేదు. మొత్తం చేనంతా నాశనమైందని రైతులు వాపోతున్నారు. కేవలం ప్లాటినం రకం విత్తనాలు సాగు చేసిన పంట మాత్రమే దెబ్బ తినడంతో ఆ విత్తనాలు నాసిరకం లేదా నకిలీవి అయి ఉంటాయని ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్లాటినం రకం విత్తనాలు దెబ్బ తీసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై మాకు ఫిర్యాదు కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే శాస్త్రవేత్తలను రప్పించి, పంట నష్టం ఎందువల్ల జరిగిందనే దానిపై పరిశీలన చేయిస్తాం. విత్తనాల వల్లే ఇలా జరిగిందా లేక ఏదైనా తెగులు సోకిందా అనే అంశాలను కూడా పూర్తిగా పరిశీలించి నిర్ధారించాల్సి ఉంది.

– సత్యనారాయణ, వ్యవసాయ అధికారి, గొల్లప్రోలు

ఎప్పుడూ ఇంత దారుణంగా నష్టపోలేదు



పదేళ్లుగా పత్తి సాగు చేస్తున్నాం. ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదు. ప్లాటినం రకం విత్తనాలు ఒక ఎకరం, మరో రకం విత్తనాలు మరో ఎకరంలో సాగు చేశాను. ప్లాటినం రకం విత్తనాలు వేసిన చేలో మొక్క లు చనిపోతున్నాయి. మొక్క ఎర్రబారి ఎండిపోతోంది. కంపెనీ ప్రతినిధులు వచ్చి చూసి వెళ్లారు తప్ప ఏ సమాధానమూ చెప్పలేదు. మాకు విత్తనాలు అమ్మిన దుకాణదారు కూడా ఎగతాళిగా మాట్లాడుతున్నాడు. ఇప్పటికే సుమారు రూ.80 వేల నష్టం వాటిల్లింది.

– దూళిపూడి వెంకటరావు, రైతు, చేబ్రోలు



చేబ్రోలులో ఎండిపోతున్న పత్తి చేను

ఎకరానికి రూ.80 వేల నష్టం



కంపెనీ ప్రతినిధితో రైతులు ఫోనులో మాట్లాడితే.. 'కావలిస్తే సైంటిస్టుల్ని తెచ్చుకోండి.. మీకు నచ్చింది చేసుకోండి' అని చెబుతున్నారు. ఎన్నిసార్లు తిరిగినా డీలర్లు, దుకాణం యజమానులు రెండు నెలలుగా పట్టించుకోలేదు. దీంతో, ఆందోళనకు దిగాల్సి వచ్చింది. రెండెకరాల్లో సాగు చేసేందుకు ప్లాటినం రకం పత్తి విత్తనాలను చేబ్రోలు సాయికృష్ణ ఏజెన్సీస్‌లో కొన్నాను. కాయలు కాసే దశలో పత్తి మొక్కలు ఎక్కడికక్కడే చనిపోవడం మొదలైంది. ఎక్కడైనా పత్తికాయ పగిలితే నల్లబారిపోతోంది. కాయ రాలిపోతోంది. మొక్క గిడసబారి గుడ్డి పత్తిలా పగులుతోంది. చివరకు మొక్క చనిపోతోంది. గత సంవత్సరం ఎకరం పత్తి సాగు చేస్తే రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకూ లాభం వచ్చింది. ఇప్పుడు మేం పెట్టిన పెట్టుబడి రూ.80 వేలు వచ్చే పరిస్థితి లేదు. తీవ్ర నష్టాల పాలయ్యాం. విత్తనాలమ్మిన దుకాణదారు తనకు సంబంధం లేదని చెబుతున్నారు.

– ఒరుగంటి సూర్యచంద్రశేఖర్, పత్తి రైతు, చేబ్రోలు



సరిగ్గా పండకుండానే ఎండిపోయిన పత్తి మొక్క

పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు



రెండెకరాల్లో పత్తి సాగు చేశాను. సుమారు రూ.2 లక్షలు పైగా పెట్టుబడి పెట్టాను. ఇప్పటి వరకూ కేజీ పత్తి కూడా చేతికి రాలేదు. చెట్లన్నీ చనిపోతున్నాయి. కాయ పగలడం లేదు. విత్తనం గురించి దుకాణదారుకు చెప్పినా పట్టించుకోవడం లేదు. రెండు నెలలుగా తిరుగుతున్నాం. కనీసం పెట్టుబడి అయినా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కేవలం ప్లాటినం రకం విత్తనాలు సాగు చేసిన వారి పంటే పూర్తిగా దెబ్బ తింది. మిగిలిన రకాలు వేసిన వారి పంటలు బాగానే ఉన్నాయి. అందువల్లనే విత్తనాల్లో తేడా ఉందని చెబుతున్నాం. దీనిపై అధికారులు విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుని, రైతులను ఆదుకోవాలి.

– ధూళిపూడి గనికిరాజు, రైతు, చేబ్రోలు

రత్నగిరిపై కొనసాగుతున్న రద్దీ



సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

- సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
- దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం

అన్నవరం: రత్నగిరిపై భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి 50 వేల మంది భక్తులు ఆదివారం సత్యదేవుని దర్శనానికి తరలి వచ్చారు. క్యూలు, వ్రత మండపాలు, ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో శ్రీకృష్ణుడికి, గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు 2 వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు సత్యదేవుని అన్నప్రసాదం స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఉదయం 10 గంటలకు టేకు రథంపై ఊరేగించారు.

నేడు సత్యదేవుని హుండీల ఆదాయం లెక్కింపు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో హుండీలను సోమవారం తెరచి భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నారు. ఉదయం 8 నుంచి స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరగనుంది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించనున్నారు. సిబ్బంది అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఈఓ ఆదేశించారు. దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గత నెల 1న లెక్కించారు. తిరిగి 35 రోజుల తరువాత లెక్కిస్తున్నారు. దసరా సెలవుల్లో సత్యదేవుని సన్నిధికి వేలాదిగా భక్తులు తరలివచ్చి, హుండీల్లో పెద్ద మొత్తంలో కానుకలు సమర్పించారు. అందువలన ఈసారి హుండీల ఆదాయం రూ.1.5 కోట్లు పైబడి వస్తుందని అంచనా వేస్తున్నారు.

దుర్గమ్మ విగ్రహం @ రూ.1.45 లక్షలు



దేవరపల్లి: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా స్థానిక మూడు బొమ్మల సెంటర్‌లోని సౌభాగ్య దుర్గాంబికా ఆలయం వద్ద ప్రతిష్ఠించి, పూజలు నిర్వహించిన అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ కమిటీ ఆధ్వర్యాన శనివారం రాత్రి వేలం నిర్వహించారు. ఈ పాటలో గ్రామానికి చెందిన జుత్తిగ సత్యనారాయణ రూ.1.45 లక్షలకు అమ్మవారి విగ్రహాన్ని దక్కించుకున్నారు. ఈ విగ్రహాన్ని ఈ నెల 8వ తేదీన గ్రామంలో ఊరేగించి, నిమజ్జనం చేయనున్నారు.

రూ.1.45 లక్షలు పలికిన దుర్గమ్మ విగ్రహం

అన్నదాన భవనానికి రూ.లక్ష విరాళం

కొత్తపేట: కోనసీమ తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం హైదరాబాద్ బండ్లగూడ ప్రాంతానికి చెందిన కూచుబట్ల శ్రీగిరి, సుధా దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ.1,00,116, పలువురు దాతలు నిత్యాన్న ప్రసాద పథకానికి విరాళాలు అందించారు. ఆయా దాతలకు దేవదాయ, ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు, సిబ్బంది స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

కళాపోషణ లేక..

- వైభవం కోల్పోతున్న రంగస్థలం
- ఉమ్మడి జిల్లాలో కొన్నిచోట్లే ప్రదర్శనలు
- చిన్న నాటకాలు, ఆ కళాకారులకు ఆదరణ కరవు



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం



దేవనర్తకి నాటకంలో చింతామణి నృత్య సన్నివేశం

కొత్తపేట: కళా'పోషణ' కనుమరుగవుతోంది.. నాటక రంగం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది.. కళాకారులకు పూట గడవడమే కష్టమవుతోంది.. ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక వెలుగు వెలిగిన రంగస్థల పౌరాణిక నాటక రంగంపై క్రమంగా చీకట్లు కమ్ముకుంటున్నాయి. గతంలో ఊరూరా నాటక ప్రదర్శనలతో సందడి నెలకొనేది. అనేక ఉత్సవాల్లో రంగస్థల వేదికలపై పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలతో కళావైభవం కనువిందు చేసేది. ప్రస్తుతం ఇది కొన్ని ఉత్సవ పందిర్లకే పరిమితమైంది. పెద్ద నాటకాల్లో కళాకారులకే ప్రాధాన్యం లభిస్తోంది. చిన్న నాటకాలు, ఆ కళాకారులకు ఉపాధి దూరమైంది. ప్రస్తుతం వారి పరిస్థితి రంగులు వెలిసిన జీవితంగా మారింది.

దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు నాటక రంగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాకు చెందిన రంగస్థల నటుల్లో పేరు ప్రఖ్యాతులు పొందిన వారెందరో ఉన్నారు. లవకుశ సినిమా రాక ముందే చింతా సుబ్బారావు నేతృత్వంలో లవకుశ డ్రామా ట్రూపు ఉండేదట. అప్పట్లో ఆ నాటకం ప్రేక్షకాదరణ పొందిందని చెబుతూంటారు. తరువాత రాజానగరం మండలం సంపత్ నగరం గ్రామానికి చెందిన పేపకాయల లక్ష్మణరావు (సంపత్ నగరం లక్ష్మణరావు) ఆంజనేయుని పాత్ర పోషించి దక్షిణాది రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి అభినవ ఆంజనేయునిగా పేరొందారు. రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్నారు. కొత్తపేటకు చెందిన జగత పెద్దకాపు 1960–75 మధ్య కాలంలో దుర్యోధనుడు, విశ్వామిత్రుడు తదితర పాత్రలకు జీవం పోశారు. కోరుకొండకు చెందిన ఎన్‌వీఎల్ ఆచారి దుర్యోధనుడిగా రాణించారు. కృష్ణుడిగా సత్యంశెట్టి (ద్వారపూడి) సూర్యారావు, ఆయన తనయుడు శేషగిరిరావు, యెరుబండి మందేశ్వరరావు, కోట నాగేశ్వరరావు, సుబ్బిశెట్టిగా పడాల సుందరం (జూనియర్ రేలంగి), మాయల ఫకీర్‌గా బెజవాడ రామారావు, బత్తిన నాగేశ్వరరావు, ధర్మరాజుగా నరేంద్రపురపు గంగరాజు, కొమ్మిశెట్టి పెద వీర్రాజు, అర్జునుడిగా తంబాబత్తుల నాగేశ్వరరావు తదితర నటులు రంగస్థలంపై తమ నటనా కౌశలాన్ని చాటారు. అలాగే ప్రస్తుతం శ్రీరాముడిగా సంపత్ నగరం లక్ష్మణరావు కుమారుడు పి.రామాంజనేయులు, ఆయన తనయుడు జూనియర్ లక్ష్మణరావు ఆంజనేయుడిగా, చింతామణిలో శ్రీహరిగా పుణ్యక్షేత్రం సత్యప్రసాద్ తదితరులు రాణిస్తున్నారు.

ఎందరున్నా కొందరికే..

ప్రస్తుత తరం నటీనటుల్లో కేవలం కొందరికే నాటక అవకాశాలు లభిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, అమలాపురం, కొత్తపేట, కడియం, వాడపాలెం, వానపల్లి, అవిడి, రామచంద్రపురం, తుని, ద్రాక్షారామ, తుని, జగ్గంపేట, కాకినాడ, యానాం, తాళ్లరేవు, చల్లపల్లి, సీతానగరం, అనపర్తి, రాజోలు, రాజానగరం, బిక్కవోలు, పెద్దాపురం, సామర్లకోట, మండపేట, ముమ్మిడివరం తదితర అనేక ప్రాంతాల్లో గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులతో పాటు శ్రీరామ నవమి, శ్రీకృష్ణాష్టమి, సుబ్రహ్మణ్య షష్ఠి, ముక్కోటి ఏకాదశి వంటి పర్వదినాలను పురస్కరించుకుని వరుసగా 9, 10 రోజులు నాటక ప్రదర్శనలు నిర్వహించేవారు. దానితో రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన పెద్ద కళాకారులకే కాక చిన్న కళాకారులకు కూడా అవకాశాలు లభించేవి. కాలక్రమేణా పందిర్ల లైటింగ్, తదితర ఏర్పాట్లు, ఉత్సవాల ఖర్చు పెరగడంతో పాటు ఆర్టిస్టుల పారితోషికం అధికమవడంతో అనేక పందిర్లలో నాటక ప్రదర్శనలకు స్వస్తి చెప్పారు. రాజమహేంద్రవరం దేవీచౌక్, చాగల్లు, అమలాపురం, కడియం వంటి పలు పందిర్లలో ఐదారు నాటకాలు ప్రదర్శిస్తూండగా, మరో ఐదారు పందిర్లలో కళా ప్రోత్సాహకుల ఆర్థిక సహకారంతో కేవలం ఒకటి, రెండు ప్రోగ్రామ్స్ పెడుతున్నారు. అవీ రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ నటులను తీసుకువచ్చి నాటకాలు వేయిస్తున్నారు. ఆ నాటకాల్లో ఒక్కో నటుడు రూ.20 నుంచి రూ.50 వేల వరకూ పారితోషికం తీసుకుంటున్నారు. అలా ఒక్కో నాటకానికి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ అవుతుంది.

హార్మోనిస్టుల పాత్ర కీలకం

రంగస్థల నాటకానికి హార్మోనియం ప్రధానం. నాటక కళాకారుడు ఎంత బాగా పాడినా, పద్య రాగాలాపన చేసినా దానికి హార్మోనియం, డోలక్, క్లారినెట్ సహకారం అవసరం. వేదికపై నటుడి కృషి ఎంతో ఉంటుందో, స్టేజీ ముందు హార్మోనియం, డోలక్, క్లారినెట్ కళాకారుల కృషి కూడా అంతే ఉంటుంది. ఇటువంటి కళాకారులు జిల్లాలో ఎంతో మంది ప్రతిభ చూపి తెరమరుగయ్యారు. ప్రస్తుతం రాజమహేంద్రవరానికి చెందిన కలిగట్ల వెంకటరమణ, సత్తిబాబు, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన మైలవరపు శ్రీనివాస్ నాయుడు, కోరుకొండకు చెందిన సుబ్రహ్మణ్యం, నరేంద్రపురానికి చెందిన టేకి వీరబాబు తదితరులు హార్మోనిస్టులుగా రాణిస్తున్నారు.

ఉపాధి దూరమైంది



నేను డ్రామాలకు హార్మోనియం ఆర్టిస్టుగా జీవనం సాగిస్తున్నాను. ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా అనేక నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. నవరాత్రుల్లో ఖాళీ లేకుండా ప్రదర్శనలు ఉండేవి. కాలక్రమేణా ప్రేక్షకాదరణ తగ్గటంతో పాటు నాటకాల వ్యయం పెరిగిపోవడంతో అనేక ఉత్సవ కమిటీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దానితో ఎందరో కళాకారులకు ఉపాధి కరువైంది.

– కలిగట్ల వెంకటరమణ, హార్మోనియం కళాకారుడు, రాజమహేంద్రవరం

మనుగడ లేని డ్రెస్ కంపెనీలు

ఒకప్పుడు డ్రామా డ్రెస్ కంపెనీలు ఎక్కువగా ఉండేవి. నటులకు వివిధ నాటకాల్లో ధరించే పాత్రలకు సంబంధించిన డ్రెస్‌లు, విగ్గులు, కిరీటాలు, గద, విల్లంబులు, కత్తులు వంటి ఆయుధాల నమూనాలు వంటి సామగ్రి అద్దెకు ఇచ్చేవారు. ప్రదర్శన పూర్తయిన తరువాత ఆ సామగ్రిలో నలిగిన వాటిని బాగు చేసి మరో ప్రదర్శనకు సిద్ధం చేసేవారు. ఇలాంటి డ్రామా డ్రెస్ కంపెనీలు పట్టణాల్లో ఉండేవి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 10 వరకూ నిర్వహించేవారు. ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గిపోవడంతో డ్రామా డ్రెస్ కంపెనీలు కనుమరుగయ్యాయి.


ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే మనుగడ



నేను కురుక్షేత్రం నాటకంలో పలు పాత్రలు పోషిస్తాను. ప్రస్తుతం అవకాశాలు అంతంత మాత్రమే. ఉత్సవ కమిటీలతో పాటు ప్రభుత్వం పౌరాణిక రంగస్థల నాటక రంగానికి ప్రాధాన్యం ఇస్తేనే మాలాంటి చిన్న నటులు మనుగడ సాగించేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయి. అక్కడ ఏటా వివిధ ఉత్సవాల్లో నాటక ప్రదర్శనలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అన్నందేవుల నారాయణరావు, రంగస్థల కళాకారుడు, కేశవరం, మండపేట మండలం

అవకాశాలు లేకుంటే పస్తులే



30 ఏళ్ల నుంచి రంగస్థల నాటక రంగంలో నటులకు అలంకరణ, డ్రెస్‌లు, సామగ్రి సప్లై చేస్తూ జీవనం సాగిస్తున్నాం. వేషాల సామగ్రి స్థానికంగా తయారు చేయడంతో పాటు చెన్నై వంటి నగరాల నుంచి కొన్ని తీసుకు వస్తాం. నాతో పాటు మరో ఐదుగురు పని చేస్తారు. గతంలో మాదిరిగా ఇప్పుడు అవకాశాలు లేవు. వేరే వృత్తిలోకి వెళ్లలేక అవకాశాలు ఉన్నప్పుడు తింటున్నాం. లేకుంటే పస్తులుంటున్నాం.

– తూము రమేష్, మేకప్ ఆర్టిస్ట్, డ్రామా డ్రెస్ కంపెనీ, రాజమహేంద్రవరం

చీరమేను... అధరేను

- మార్కెట్‌లోకి విరివిగా చేపలు
- బకెట్ ధర రూ.28 వేలు
- అయినా దొరకని వైనం

యానాం: చీరమేను.. ఈ పేరు చెబితేనే నోరూరుతోంది.. గోదారోళ్లకు పులస తర్వాత అత్యంత ప్రియమైన చేప ఇది. చిన్న సైజులో ఉండే చీరమేనును అంతా లొట్టలేసుకుని ఆరగిస్తారంటే, దాని రుచే వేరని చెప్పకనే అర్థమవుతోంది. సీజనల్ చేప కావడంతో ముఖ్యంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో శీతాకాలం ప్రారంభంలో దొరుకుతోంది. ఇది గోదావరి నదీ ముఖద్వారం వద్ద అంటే (తీపినీరు), సముద్రం (ఉప్పునీరు) కలిసే ప్రాంతాల్లో లభిస్తుంది. చీరమేనును సోల, సేరు, తవ్వ, గ్లాసు, బకెట్ కొలతల్లో విక్రయిస్తుంటారు. యానాం మార్కెట్‌లో ఇది అధికంగా లభిస్తుండటంతో మాంసాహార ప్రియులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ వేలం ద్వారా ఈ చేపలను విక్రయిస్తుండడం విశేషం. ఆదివారం ప్లాస్టిక్ బకెట్‌లో ఉన్న సుమారు 10 సేర్ల చీరమేను ధర రూ.28 వేలు పలికింది. ఇలా చీరమేనుకు అధిక ధర లభిస్తుండడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నదీ ముఖద్వారంలో లభ్యం

సుమారు అంగుళం సైజులో ఉండే చీరమేను చేపలను వలలతో పట్టడం సాధ్యం కాదు. దీనిని చీరల సహాయంతో గోదావరి ముఖ ద్వారాల్లో మత్స్యకారులు పడుతుంటారు. చీరలతో పట్టడం వల్లే దీనికి చీరమేను అనే పేరు వచ్చిందని చెబుతుంటారు. సముద్రం, నదీ కలిసే ప్రాంతాల వద్ద చల్లగా వీచే తూర్పు గాలులకు నీటి అడుగుభాగంలో ఉన్న చీరమేను కాస్తా పైకి వస్తుంది. ముఖ్యంగా దసరా నుంచి దీపావళి వరకూ అధికంగా లభిస్తుంది. ఇది ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సమృద్ధిగా ఉన్న లిజర్డ్‌ఫిష్ జాతికి చెందినదిగా చెబుతుంటారు.

అబ్బబ్బా... ఆ రుచే వేరు

చీరమేనును మామూలు చేపల కూరలా కాకుండా ప్రత్యేక విధానంలో వండుతుంటారు. దీనిని చాలా మంది చింతకాయ, చింతకూర వేసుకుని ఇగురు పెడతారు. అంతేకాకుండా గారెలుగా వేసుకుని ఆరగిస్తారు. వివిధ రకాలుగా చీరమేనును ఫ్రైగా సైతం చేసుకుంటారు. ఈ రుచికి అలవాటు పడిన వారు ఎంతైనా కొనుగోలు చేస్తారని వినియోగదారులు అంటున్నారు.


చీరమేను చేపలు


అమ్మకానికి సిద్ధం చేసిన చీరమేను


యానాం గోదావరి పుష్కర ఘాట్‌లో చీరమేను చేపలకు వేలం పాట

ఈ సీజన్‌లో పండగే



చీరమేను చేపల సీజన్ వచ్చిందంటే మాకు పండగే. ప్రస్తుతం వ్యాపారం బాగా సాగుతుంది. ఈ ఏడాది పులసలు చాలా తక్కువగా పడ్డాయి. దీంతో నిరాశలో పడ్డాం. ప్రస్తుతం చీరమేను పడుతుండటంతో చాలా ఆనందంగా ఉంది. వేటకు చీరలతో వెళ్తున్నాం.

– పాలెపు పోసియ్య, మత్స్యకారుడు, యానాం

బంధువులకూ పంపుతున్నాం



ఈ ఏడాది చీరమేను పడుతుండటంతో ఎక్కువ ధర ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నాం. మేము తినడంతో పాటు మా బంధువులకు సైతం దాని రుచిని చూపించాలనే ఉద్దేశంతో పంపుతున్నాం. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు చెందిన వారికి చీరమేను రుచి తెలిసిందే.

– పుణ్యమంతుల సత్తిబాబు, జి.వేమవరం

ఎక్కడ లభిస్తుందంటే..

గౌతమీ గోదావరి నది నీరు యానాం వద్ద బంగాళాఖాతంలో భైరవపాలెం సమీపంలో కలుస్తుంది. ఈ ప్రాంతంలో చీరమేను ఎక్కువగా లభిస్తుంది. ఇక్కడ పడిన చీరమేనును యానాం మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. దూర ప్రాంతాల్లోని తమ బంధువులకు ఈ చేపలను స్థానికులు తీసుకెళ్తుంటారు. జిల్లా పరిసర ప్రాంతాలతో పాటు విశాఖ, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు కూరగానో, ఐస్‌లో పెట్టో పంపుతుంటారు. అందుకే వీటికి డిమాండ్ పెరుగుతోంది.

జో లాలీ.. నిద్ర వీడాలి



అలసిన ప్రయాణానికి ఆటో పడకగా మారింది.. చేరాల్సిన గమ్యం ప్రమాదపుటంచున సాగింది.. అసలే పరిమితికి మించిన ప్రయాణం.. ఆపై ప్రయాణికుల పవళింపు.. ఇది ఉప్పలగుప్తంలో కనిపించిన దృశ్యం. ఒక డ్రైవర్ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం ఓ తప్పయితే, వెనుక భాగంలో డోర్‌ను తీసి ప్రయాణికులను కూర్చోపెట్టాడు. అంత కంటే నిర్లక్ష్యంగా ముగ్గురు మహిళలు అక్కడ కూర్చోగా, ఇద్దరు నిద్రిస్తూ వెళ్లారు. ఇంత నిర్లక్ష్యపు ప్రయాణాలతో ప్రమాదాలు జరుగుతున్నా, కాస్తయినా ఆలోచన ఉండడం లేదని ప్రజలు పెదవి విరిచారు. వాహనాలకు చిన్న కారణాలతో చలానాలు విధించే రవాణా శాఖకు ఇవి కనిపించడం లేదా అని విమర్శించారు.

–ఉప్పలగుప్తం

క్లుప్తంగా

గోదావరిలోకి దూకి ఆత్మహత్యాయత్నం

మలికిపురం: మండలంలోని దిండి – చించినాడ వంతెన పైనుంచి ఆదివారం ఒక వ్యక్తి గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతను సఖినేటిపల్లికి చెందిన మేడిద సుదర్శన్‌రావు (25)గా స్థానికులు గుర్తించారు. వంతెనపై పార్క్ చేసిన బైక్, సెల్ ఆధారంగా అతని వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు అతని బంధువులకు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటనకు సంబంధించి కారణాలు తెలియాల్సి ఉంది. కాగా దీనిపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నదిలో గల్లంతైన వృద్ధుడి కోసం గాలింపు


వృద్ధుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ నాగరాజు నాయక్

నిడదవోలు రూరల్: మండలంలోని పెండ్యాల గ్రామంలో ఈ నెల 2న బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ గోదావరిలోకి జారిపడి గల్లంతైన వృద్ధుడు ఉల్లూరి చిరంజీవి ఆచూకీ కోసం ఆదివారం నదిలో ముమ్మరంగా గాలించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో పాటు గజ ఈతగాళ్లతో నిరంతరాయంగా గాలిస్తున్నామని తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ తెలిపారు. ఈ గాలింపు చర్యలను అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

నిడదవోలు: స్థానిక రైల్వే స్టేషన్ యార్డ్ చిన్న కాశీరేవు ఓవర్ బ్రిడ్జి కింద సుమారు 60 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. రాజమహేంద్రవరం వైపునకు వెళ్లిన రైలు ఢీకొని అతను మృతి చెందినట్లు రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడు ఒంటిపై ఎరుపు రంగు గళ్ల చొక్కా, ఎరుపు, నీలం, బిస్కెట్ రంగు లుంగీ ఉంది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుని సమాచారం తెలిసిన వారు 94906 17090 ,70133 60296 నంబర్లకు ఫోన్ చేసి తెలపాలని ఆయన వివరించారు.

బాణసంచా పేలి అర్చకులకు గాయాలు

పి.గన్నవరం: మండలంలోని మానేపల్లి గ్రామంలో శనివారం రాత్రి దసరా మహోత్సవాల ముగింపు ఊరేగింపులో బాణసంచా పేలి ఇద్దరు అర్చకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక ఊరేగింపునకు చెందిన తారాజువ్వ, మరో ఊరేగింపు ట్రాక్టర్‌పై పడటంతో అందులో ఉన్న తారాజువ్వలు కాలి ఈ ప్రమాదం జరిగింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. మానేపల్లి శివారు శివాయలంకకు చెందిన ఊరేగింపు ఆ గ్రామ సెంటర్‌కు చేరుకుంది. అదే సమయంలో మానేపల్లి మెయిన్ గ్రామంలోని అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించేందుకు సిద్ధం చేశారు. ఈలోగా శివాయలంకకు చెందిన ఒక వ్యక్తి తారాజువ్వ వేశాడు. అది మానేపల్లి మెయిన్ ఊరేగింపు ట్రాక్టర్‌పై పడింది. దీంతో ఆ ట్రాక్టర్‌లో ఉన్న తారా జువ్వలకు నిప్పు అంటుకుంది. అక్కడున్న అర్చకులు విజయ ప్రసాద్, రత్నగోపాల్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు.



కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న అర్చకులు విజయ ప్రసాద్, రత్నగోపాల్

ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు

జగ్గంపేట: భారత ఎన్నికల సంఘం పనితీరుపై అనుమానాలు, సందేహాలు నెలకొనడం విచారకరమని జేవీవీ వ్యవస్థాపకుడు వెన్నపూస బ్రహ్మారెడ్డి అన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఒమ్మి రఘురామ్ అధ్యక్షతన జగ్గంపేట వివేకానంద విద్యా సంస్థలలో జిల్లా స్థాయి ప్రజా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ఆయువు లాంటివని, కానీ ఎన్నికల కమిషన్ తీరు పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. ఎన్నికల ప్రక్రియపై, ఓటరు లిస్టులపై, ఎన్నికలలో పోలింగ్ శాతం, వాటి కౌంటింగ్ శాతాల్లో హెచ్చుతగ్గులు, ఈవీఎంల సంఖ్య, వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించి సందేహాలను నివృత్తి చేయకపోవడం దారుణమని అన్నారు. ప్రజాస్వామ్యంపై ప్రజలకు నమ్మకాన్ని కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదేనన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో 2024లో చట్టం ద్వారా సుప్రీంకోర్టు న్యాయమూర్తి స్థానంలో సీనియర్ మంత్రిని చేర్చడంతో, వస్తున్న ఆరోపణలకు మరింత బలం చేకూర్చేలా ఉందని తెలిపారు. సభాధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేత ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రస్తుతం సంక్షోభంలో కూరుకుపోతోందని, దీనిపై ప్రతి పౌరుడూ స్పందించాలన్నారు. ఎన్నికల సంఘం తీరుపై వస్తున్న విమర్శల నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రజా సదస్సులు నిర్వహించి వార్తా కథనాలు – వాస్తవాలు అనే అంశంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సదస్సులో ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొతారపు ప్రసాద్, కోర్ కమిటీ సభ్యులు లోకేనాథ్, సంస్థ ప్రధాన కార్యదర్శి సుందరపల్లి గోపాలకృష్ణ, ప్రసంగి ఆదినారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు పప్పు దుర్గాప్రసాద్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జేవీవీ వ్యవస్థాపకుడు బ్రహ్మారెడ్డి

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో అండర్–14, 17 విభాగాల్లో పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ నెల 4న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరిగాయని అన్నారు. ఇందులో విజేతలు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీలకు హాజరవుతారని త్రిమూర్తులు వివరించారు. కాగా అంబాజీపేటకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైన వారిలో ఉన్నారన్నారు. ఇందులో అండర్–14 బాలికల విభాగంలో కె.సుందరి హరిప్రియ, వై.ఇషా శ్రీనిజ, ఎం.మౌనిక, అండర్–14 బాలుర విభాగంలో బి.హేమ హృతిక్, అండర్–17 బాలికల విభాగంలో పి.చరణ్యశ్రీలు ఉన్నారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం కడలి సాయిరాం, పీడీ ఉమామహేశ్వర్, కుంపట్ల ఆదిలక్ష్మి, సూర్యకుమారి, క్రీడాకారులు అభినందించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పెదపూడి: జి.మామిడాడలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ పీవీ సీతాపతిరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అధికారులకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఆదివారం జి.మామిడాడ గజం కాలువ సమీపంలో ఓ ఇంటిపై తహసీల్దార్‌తో పాటు వీఆర్వోలు దాడి చేశారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 14.57 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. పోలీసులు, ఎంఎస్‌ఓ కమల, వీఆర్వోలు వివరాలు సేకరించారు. ఆ బియ్యాన్ని వేళంగిలోని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు. అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన వేండ్ర గ్రామానికి చెందిన నర్ల సత్తిబాబుపై 6ఏ కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు కె.శ్రీను, ఎల్.రాంబాబు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న తహసీల్దార్ సీతాపతిరావు తదితరులు

సామాజిక చైతన్యం కోసం కవుల పోరాటం

సాహితీ సదస్సులో శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్

అమలాపురం టౌన్: దళిత కవి తేజాలైన కుసుమ ధర్మన్న, గుర్రం జాషువా, బోయి భీమన్నలు తమ కలాలతో సామాజిక చైతన్యం కోసం పోరాడారని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. తెలుగు అసోసియేషన్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్రప్రదేశ్ భాషా సంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం భూపయ్య అగ్రహారంలోని కోనసీమ మహిళా మండలి భవనంలో దళిత తేజాల పేరిట ఆదివారం రాష్ట్ర స్థాయి సాహిత్య సదస్సు జరిగింది. దీనికి తెలుగు అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధ్యక్షురాలు కె.ఉషాజ్యోతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆ ముగ్గురి మహా కవులు రచించిన కావ్యాలు, కథలు, కవితలపై చర్చించారు. సామాజిక కవి కుసుమ ధర్మన్న సమానత్వం కోసం పోరాడితే, కవి గుర్రం జాషువా సామాజిక రుగ్మతలపై తన కలంతో ఎక్కుపెట్టారని డాక్టర్ ప్రతాప్ గుర్తు చేశారు. ఇక కవి బోయి భీమన్న సామాజిక చైతన్యం కోసం పోరాడారన్నారు. సదస్సు కన్వీనర్లుగా శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘ అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ వ్యవహరించారు. తొలుత కవులు ధర్మన్న, జాషువా, భీమన్న చిత్రపటాలకు కవులు, సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సుకు హాజరైన దాదాపు 60 మంది కవులు, రచయితలు, సాహితీవేత్తలు తమ సాహిత్య పత్రాలను సమర్పించారు. వారి సాహిత్యాలపై సదస్సు విశ్లేషణ చేసింది. హాజరైన కవులు, రచయితలు, సాహితీవేత్తలను సదస్సు నిర్వాహకులు సత్కరించారు. కవులు అరిగెల బలరామమూర్తి, రవిచంద్ర, సబ్బెళ్ల వెంకట మహాలక్ష్మి, ఎం.నాగభూషణం, కోరుకొండ జాన్, పాలమూరి వెంకట్, జె.రాంబాబు, ముక్కామల చక్రధర్, వైఆర్‌కే నాగేశ్వరరావు, బొలిశెట్టి అనసూయ, కడలి సత్యనారాయణ, బి.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


కవులు ధర్మన్న, భీమన్న, జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రతాప్, కవులు, సాహితీవేత్తలు

ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి


ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

అల్లవరం: ప్రతి పండగకు ఉద్యోగులకు డీఏ లేదా పీఆర్సీ, ఐఆర్ ఏదొకటి ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. ఇది ఉద్యోగుల ప్రభుత్వమని, నూతన పీఆర్సీని ప్రకటిస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, డీఏ బకాయిలు చెల్లిస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నేతలు, 16 నెలల్లో ఉద్యోగులకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. 16 నెలల కాలంలో ఒక్క డీఏ ప్రకటించారా అని ప్రశ్నించారు. ఉద్యోగులను కూటమి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని విమర్శించారు. పండగ వచ్చిన ప్రతిసారీ ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న ఉద్యోగులకు తీవ్ర నిరాశ తప్పడం లేదన్నారు. ఉద్యోగులకు ఇస్తామన్న రూ.30 వేల కోట్లు ఎప్పుడు ఇస్తున్నారో ప్రకటించాలని, ఈ దీపావళికి పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

యువకుడి మృతి

అమలాపురం రూరల్: బండారులంక శివారు చినచంద్రపురం షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు కథనం ప్రకారం.. సమనస గ్రామానికి చెందిన లింగోలు శేషగిరి (22), చవాకుల దుర్గాప్రసాద్‌లు మోటారు సైకిల్‌పై అంబాజీపేటలో దసరా సంబరాలు చూసేందుకు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. అక్కడికక్కడే శేషగిరి మృతి చెందగా, దుర్గాప్రసాద్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. అతన్ని 108లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. శేషగిరి తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడని ఎస్‌ఐ తెలిపారు.

బీసీవైపై పార్టీ అధినేత నిర్బంధం

- రామచంద్ర యాదవ్‌ను హోటల్‌లో నిర్బంధించిన పోలీసులు
- పోలీసులకు, ఆయన సెక్యూరిటీకి మధ్య ఘర్షణ
- రాజమహేంద్రవరంలో తీవ్ర ఉద్రిక్తత


రామచంద్ర యాదవ్ సెక్యూరిటీ సిబ్బంది, ఎస్సైల మధ్య తోపులాట

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న మత్స్యకారులు, రైతులకు అండగా నిరసనకు పిలుపునిచ్చిన భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడే రామచంద్ర యాదవ్‌ను పోలీసులు ఆదివారం రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో నిర్బంధించడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పాయకరావుపేట నియోజకవర్గంలోని రాజయ్యపేటలో మత్స్యకారులు, రైతులకు మద్దతుగా నిరసన తెలిపేందుకు బీసీవై పార్టీ పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు గాను రామచంద్ర యాదవ్ రాజమహేంద్రవరం చేరుకుని షెల్టాన్ హోటల్‌లో బస చేశారు. ఆయనకు నక్కపల్లి పోలీసులు ఇచ్చిన నోటీసులను అందించేందుకు రాజమహేంద్రవరం సౌత్, సెంట్రల్ జోన్ డీఎస్పీలు భవ్య కిషోర్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యాన ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పోలీసులు అధిక సంఖ్యలో ఆ హోటల్ వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వై కేటగిరీ భద్రత ఉన్న రామచంద్ర యాదవ్ సెక్యూరిటీ సిబ్బందికి, రాజమహేంద్రవరం పోలీసులకు మధ్య హోటల్‌లో ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. రామచంద్ర యాదవ్ గదిలో నుంచి బయటకు వస్తుండగా సెక్యూరిటీని పోలీసులు తోసివేశారు. అనంతరం ఆయనకు పోలీసులు నోటీసు అందించి, గదిలోకి పంపించి, బయటకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో రామచంద్ర యాదవ్ తిరిగి పుంగనూరు వెళ్లేందుకు ప్రయత్నించగా బయటకు రాకుండా నిలుపుదల చేశారు. మధ్యాహ్నం ఆయన పుంగనూరుకు బయల్దేరుతూ విలేకర్లతో మాట్లాడారు. రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ బాధితులైన మత్స్యకారులు, రైతులకు మద్దతుగా బీసీవై పార్టీ నిరసన తెలపడానికి వెళ్తుంటే పోలీసులు శాంతిభద్రతల సమస్య పేరు చెప్పి అడ్డుకునే ప్రయత్నం చేశారని అన్నారు. వారు నోటీసు ఇవ్వడంతో తిరిగి పుంగనూరు వెళ్లడానికి ప్రయత్నిస్తే రూమ్‌లో నుంచి బయటకు రాకుండా నిర్బంధించే ప్రయత్నం చేశారని చెప్పారు. దీనిపై న్యాయ, చట్టపరమైన చర్యలు తీసుకుంటానన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. హైకోర్టు అనుమతితో వారం పది రోజుల్లో నక్కపల్లి మండలంలో పర్యటించి, మత్స్యకారులకు, రైతులకు మద్దతుగా బీసీవై పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం వ్యవసాయ భూములు, మత్స్యకారులుండే తీర ప్రాంత భూములను బలవంతంగా లాక్కొని, వారి జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజంగా రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకు రావాలనే చిత్తశుద్ధి ఉంటే లక్షలాది ఎకరాల బీడు భూములు, సెజ్‌ల కోసం సేకరించిన భూములు ఉన్నాయని చెప్పారు. తీర ప్రాంతాలు, పంట భూములపై కన్నేసి పారిశ్రామికాభివృద్ధి పేరిట రూ.వేల కోట్ల చీకటి ఒప్పందాలకు, కుట్రలకు తెర తీస్తోందని ఆరోపించారు.

ఆది నాయకా.. వినాయకా


విశేష అలంకరణలో విఘ్నేశ్వర స్వామివారు

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఆదినాయకుడైన ఆ వినాయక స్వామి వారిని చూసి భక్తుల మది మురిసింది. తెల్లవారుజామునే స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకాలు, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ చేశారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి మహా నివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయం తలుపులు మూసివేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 52 మంది, ఉండ్రాళ్ల పూజలో ఇరువురు పాల్గొన్నారు. ఇద్దరు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేశారు. లక్ష్మీగణపతి హోమంలో 13 జంటలు, వాహన పూజలను 49 మంది చేయించుకున్నారు. 1,820 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ ఒక్కరోజు వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాలుగా రూ.3,27,275 ఆదాయం సమకూరిందని అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.